# టౌన్ ప్లానింగ్ తీరుపై సభ్యుల ఆగ్రహం

## పెడన కౌన్సిల్ సాధారణ సమావేశం




మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ కటకం నాగకుమారి; పాల్గొన్న కౌన్సిలర్లు కటకం ప్రసాద్ తదితరులు

**పెడన:** పట్టణంలో ఎక్కడ ఏ నిర్మాణం జరుగుతుందో తెలియని స్థితిలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారంటూ కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కౌన్సిల్ సమావేశం హాలులో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. తొలుత నూతనంగా విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఆనంద్‌లు సభ్యులకు పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన అజెండాలోని పలు అంశాలపై చర్చించారు. 17వ వార్డులో రోడ్డు నిర్మాణానికి సంబంధించి టౌన్‌ప్లానింగ్ అధికారులు రెండు సార్లు కొలతలు వేశారని, ఆక్రమణలున్నాయా లేదా అనే విషయం మాత్రం తెలియజేయడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీ అన్నారు. టీపీవో సమాధానం ఇవ్వాల్సిందిగా కోరారు. టీపీవో సుజన కుమారి సమాధానం ఇస్తూ టౌన్ సర్వేయర్ రిపోర్టు ఇవ్వలేదని, ఇంకా సర్వే పూర్తి కాలేదన్నారు. సర్వే పూర్తి చేసి నివేదికలు వచ్చిన తరువాతే రోడ్డు వేయాలని గోపి చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. గత కమిషనర్ హయాంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, ప్రస్తుత కమిషనర్ చెత్త నిల్వలు లేకుండా చేయిస్తున్నారని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. మరింత మెరుగుపరిచేలా చూడాలని కోరారు. మున్సిపల్ ఆదాయం అంతంత మాత్రమేనని, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌ల ద్వారా ఆదాయం రాబట్టేలా చూడాలని 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు కోరారు. కమిషనర్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆస్తిపన్ను పెంపు ద్వారానే ఆదాయం పెరుగుతుందని, అది కూడా సభ్యుల చేతుల్లోనే ఉందని, ప్రభుత్వం కూడా 20 శాతం పెంచుకోవాలని స్పష్టం చేసిందని సభ దృష్టికి తీసుకువచ్చారు. 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ మాట్లాడుతూ ఆశీలు వసూళ్ల పాటపాడుకున్నది ఒకరైతే వసూలు చేసేది డిఫాల్టర్ అని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆశీలు విషయంలో ఇప్పటికే కోర్టు చుట్టూ తిరిగే పరిస్థితి వచ్చిందని, తిరిగి మళ్లీ పరిస్థితి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ద్వారా మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, అధికారులు, సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మహిళా పోలీసుల బదిలీల్లో న్యాయం చేయాలని వినతి



**చిలకలపూడి(మచిలీపట్నం):** గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసుల బదిలీల్లో తమకు న్యాయం చేయాలని గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ సంక్షేమ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 27వ తేదీ జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్ సక్రమంగా నిర్వహించలేదని వారు వివరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా మొత్తం ఒకేసారి కౌన్సెలింగ్ జరగకపోవటం వల్ల బదిలీల విషయంలో స్పష్టత లేదన్నారు. కౌన్సెలింగ్ పారదర్శకంగా జరగకుండా సీనియార్టీని, మెరిట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఖాళీలు ఉన్న అన్ని స్థానాలను చూపించకుండా వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఏదో ఒకటి ఎంచుకోమని కౌన్సెలింగ్ నిర్వహించటం సమంజసంకాదన్నారు. బదిలీల ప్రక్రియలో జీవో నంబరు 6 పరిగణనలోకి తీసుకోలేదన్నారు. తిరిగి మరలా కౌన్సెలింగ్ నిర్వహించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. సంఘ ఉపాధ్యక్షురాలు ఎం.కల్పనామయూరి, జి.సుమలత, పి.కల్పనాదేవి తదితరులు ఉన్నారు.

### విత్తన విక్రయ కేంద్రాల తనిఖీ

**చల్లపల్లి:** మండల పరిధిలోని విత్తన విక్రయ కేంద్రాలను, వాటి అనుబంధ గిడ్డంగులను సోమవారం ఎంఏవో కె.మురళీకృష్ణ తనిఖీ చేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ డీలర్లు ప్రతిరోజూ స్టాక్ వివరాలను, వాటి ధరలను తెలుపుతూ స్టాక్‌బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొన్నప్పుడు రశీదు ఇవ్వాలన్నారు. వీఏఏ సాయిచందు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మచిలీపట్నంటౌన్:** నగరంలో ఈ నెల 1వ తేదీ మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎ.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బలరామునిపేట, మూడు స్తంభాల సెంటర్, కుమ్మరిగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

# ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



**ఘంటసాలపాలెం(ఘంటసాల):** భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం భారతదేశ అభివృద్ధికి తిరుగులేని శక్తిగా పని చేస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవీశ్రీ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం చినదళితవాడలో దివంగత గడ్డేటి వెంకయ్య– నాగేశ్వరమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అందించిన స్థలంలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 11 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సర్పంచ్ దోనె రజని వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆర్‌పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దేవిశ్రీ ప్రసాద్ ఆవిష్కరించి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఏపీ ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఏపీ న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ వెలగపల్లి వెంకటేశ్వరరావు, ఏబీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్, కృష్ణా జిల్లా మాలమహానాడు నేత దోవా గోవర్ధన్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, వేమూరి సాయి వెంకటరమణ, మునిపల్లి బుజ్జి ఇతర దళితనేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ కొల్లూరి విజయ, ఉప సర్పంచ్ కంచర్ల లక్ష్మి, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అంబేడ్కర్ యూత్, మహిళలు, గ్రామస్తులు, దళితనేతలు, అభిమానులు పాల్గొన్నారు. పలువురిని సత్కరించారు.

# పంట కాలువలకు సాగునీరు విడుదల

సాక్షి ఎఫెక్ట్

**అవనిగడ్డ:** దివిసీమ పంటకాలువకు ఎట్టకేలకు సాగునీటిని విడుదల చేశారు. సాగునీటి విడుదలలో జాప్యం, దీనివల్ల కలిగే ఇబ్బందులు, నష్టాలపై జూన్ 29వ తేదీన సాక్షిలో 'సాగునీరెప్పుడు?' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సోమవారం మోపిదేవి వార్పు వద్ద సోమవారం పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సాగునీరు అవనిగడ్డ లాకులకు చేరుకోగా అక్కడ నుంచి కోడూరు, నాగాయలంక పంటకాలువలకు అధికారులు సాగునీటిని దిగువకు విడుదల చేశారు. పంటకాలువలకు సాగునీరు వదలడంతో రైతులు నారుమళ్లు పోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.



మోపిదేవివార్పువద్ద సాగునీరు విడుదలచేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**దివిసీమకు సాగునీరు విడుదల**

**మోపిదేవివార్పు(మోపిదేవి):** మండలంలోని మోపిదేవివార్పు వద్ద ఎల్ఎఫ్ఆర్ గేట్లు ఎత్తి సోమవారం దివిసీమకు సాగు, తాగు నీటిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడారు. కేఈబీ కెనాల్ నుంచి కె.కొత్తపాలెం వద్ద సాగు, తాగునీటిని సోమవారం చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్‌కుమార్ విడుదల చేశారు. సుమారు 28 కిలోమీటర్లు ప్రయాణించి మచిలీపట్నం, కేఈబీ కెనాల్ నుంచి బండికోళ్లంక వద్ద నీటి సంఘం అధ్యక్షుడు వేములపల్లి పిచ్చేశ్వరావు సాగునీరు విడుదల చేశారు. తొలుత మోపిదేవి వార్పు వద్ద సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నివాళులర్పించారు. మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరావు, చల్లపల్లి, నాగాయలంక డీసీ చైర్మన్లు నిడమానూరు దిలీప్‌కుమార్, బడ్డెడ్డి మల్లిఖార్జునరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరావు, టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, యాసం చిట్టిబాబు, పూషడపు రత్న గోపాల్, సనకా ప్రశాంత్, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, చందన రంగారావు, నీటి సంఘాల అధ్యక్షులు వేములపల్లి పిచ్చేశ్వరావు, మత్తి నాగమల్లేశ్వరావు, సర్పంచ్ దిడ్ల జానకీరాం బాబు, మురాల సుబ్బారావు, ఇరిగేషన్ ఈఈ రవికిరణ్, డీఈఈలు దాసరి గౌతమి, జే బాబూనాయక్, రవితేజ, రైతులు పాల్గొన్నారు.

### వారాహి మాతకు విశేష అర్చన



**నాగాయలంక:** స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారు ఉన్మత్త వారాహిదేవి అలంకరాంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఉన్మత్త వారాహి మాతను నిమ్మకాయలతో అలంకరించి విశేషార్చన చేశారు. వారాహి దీక్షా కంకణబద్ధులైన ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, ముదునూరి అచ్యుత శేఖరశర్మలు తెల్లవారు జామున వారాహి అమ్మవారికి శాస్త్రోక్తంగా కుంకుమ పూజ జరిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కల్యాణం నరసింహారావు– సామ్రాజ్యం దంపతులు పీటలపై కూర్చుని అమ్మవారి నవరాత్రుల పూజా క్రతువు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఉన్మత్త వారాహిదేవి, కనకదుర్గమ్మ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీరామ క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్, బోయపాటి రాము, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కేవీ విద్యార్థినికి గిన్నిస్ రికార్డు పార్టిసిపేషన్ సర్టిఫికెట్



**మచిలీపట్నంటౌన్:** స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థిని జుజ్జూరి జశ్విత పూర్ణకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుంచి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న ధ్రువీకరణ పత్రం దక్కింది (పార్టిసిపేషన్ సర్టిఫికెట్). భారత్ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారు 2024 డిసెంబర్ 24న నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన పోటీలో 4218 మంది కూచిపూడి నృత్య కళాకారులతో ఎక్కువసేపు కూచిపూడి నృత్యాన్ని బృందంతో కలిసి ప్రదర్శన చేయటంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. ఆ పత్రాన్ని ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ జశ్విత సాయి పూర్ణకు సోమవారం అందించి అభినందించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నృత్య ప్రదర్శనలో పాల్గొని పార్టిసిపేషన్ నమోదు చేయించుకున్న జశ్విత సాయి పూర్ణను విద్యాలయ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### మెరుగైన తపాలా సేవల కోసమే ఐడీసీ విధానం



**మచిలీపట్నంటౌన్:** ఉత్తరాలను వేగంగా బట్వాడా చేయటమే లక్ష్యంగా తపాలా శాఖ ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ల (ఐడీసీ) విధానాన్ని అమలు చేస్తోందని ఆ శాఖ మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బీ శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని పోస్టల్ రీజినల్ కార్యాలయ అధికారుల ఆదేశాలతో నగరంలోని మున్సిపల్ ప్రధాన పార్కు ఎదురుగా ఉన్న హెడ్ పోస్టాఫీస్‌లో సోమవారం ఐడీసీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా మచిలీపట్నం నగరంతో పాటు మండలం, పెడన, గూడూరు మండలాల్లోని గ్రామాలకు నేరుగా మచిలీపట్నం నుంచే ఉత్తరాల బట్వాడా జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా ఆదివారాలు, పండుగ రోజుల్లో కూడా ఉత్తరాలను బట్వాడా చేస్తారన్నారు. ఉత్తరాలను బైక్‌లపై వెళ్లి అందజేసే విధానం ను అమలు చేస్తున్నామన్నారు. ఈ విధానం మచిలీపట్నంలో సోమవారం నుంచే అమల్లోకి వచ్చిందన్నారు. పోస్టల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బ్యాంకులపై రైతులకు అవగాహన

**బంటుమిల్లి:** జాతీయ బ్యాంకుల ద్వారా రైతులకు అందుతున్న పథకాలు, ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై రైతులకు పూర్తి అవగాహన ఉండాలని సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సామాజిక భద్రత సొసైటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు సంస్థ సోమవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. యూనియన్ బ్యాంకు విశ్రాంత మేనేజరు వసుధ బసవేశ్వరరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టరు బి.బిక్షారావు పాల్గొని బ్యాంకులు రైతులకు అందజేస్తున్న పథకాలు, డిపాజిట్లు, కేవైసీలు, డ్వాక్రా మహిళల రుణాలు, బ్యాంకింగ్ మోసాలు, బీమా పథకాలు తదితర బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏఓ జి.శివరామకృష్ణ, ఆర్గిడ్స్ ప్రతినిధి తేజ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### సోలార్ సిస్టం ప్యానళ్ల పరిశీలన

**కోడూరు:** మండలంలోని పలు నివాసగృహాల్లో సూర్యఘర్ పథకం కింద ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం ప్యానళ్లను విద్యుత్ శాఖ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ సోమవారం పరిశీలించారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా సబ్సిడీ అందివ్వడంతో పాటు సంబంధిత ఏజెన్సీల నిర్వాహకులు వచ్చి సోలర్ ప్యానల్స్‌ను ఇళ్ల వద్ద బిగిస్తారని ఈఈ చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో తొలిసారిగా ఈ పథకం కింద సోలర్ సిస్టం పెట్టుకున్న పోటు మీద గ్రామానికి చెందిన వి.లక్ష్మయ్య తాను వినియోగించుకున్న విద్యుత్‌తో పాటు అదనంగా 215 యూనిట్లు ఉత్పత్తి అయినట్లు ఈఈ చెప్పారు. యూనిట్‌కు రూ.9 పైసుల చొప్పున రూ.449 నగదు చెక్కును లబ్ధిదారుడు లక్ష్మయ్యకు ఈఈ అందించారు. ఏడీఈ నడకుదిటి సుబ్రహ్మణ్యం, ఏఈ గోపిచంద్, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులకు శిక్షణ

**ఘంటసాల:** రైతు ఉత్పత్తిదారుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని కృష్ణాజిల్లా కోఆపరేటివ్ బ్యాంకు డీజీఎం వరాలమ్మ అన్నారు. రైతు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడారు. ఏజీఎం ప్రదీప్ కుమార్ రెడ్డి, ఏపీ కోఆపరేటివ్ బ్యాంకు డీపీడీఎం కలందర్, డీపీడీఎం పవన్, కృష్ణాజిల్లా కోఆపరేటివ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా ఆషాఢ సారె సమర్పణ



**గణపేశ్వరం(నాగాయలంక):** ఆషాఢమాసం సందర్భంగా మండలంలోని గణపేశ్వరం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం 108 కిలోల పసుపు, కుంకుమలను కావళ్లతో ఆషాఢ సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలో నిలుచుని ఉండే శ్రీదుర్గాదేవి అమ్మవారి మూలవిరాట్‌ను, ఎదురుగా ఆలయ ముఖ మండపాన్ని, శ్రీగణపేశ్వరస్వామి ఆలయంలో శివలింగాన్ని సుందరంగా అలంకరించారు. తొలుత వివిధ గ్రామాల మహిళలు సారె పళ్లాలు, కావళ్లతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. నాగాయలంక, అవనిగడ్డ, గణపేశ్వరం, తలగడదీవి తదితర ప్రాంతాల నుంచి మహిళలు సారె పళ్లాలతో పాల్గొన్నారు.



# ఉద్యోగుల సేవలు మరువరానివి



సుకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరించిన పేర్ని నాని

## వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని

**మచిలీపట్నంటౌన్:** పంచాయతీరాజ్ శాఖలో వివిధ హోదాల్లో పని చేసి బందరు మండలం అరిసేపల్లి గ్రామ పంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శిగా సోమవారం ఉద్యోగ విరమణ చేసిన పడమటి సుకుమార్ సేవలు మరవరానివని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. స్థానిక కొత్త హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సుకుమార్ నివాసానికి పేర్నినాని వెళ్లి సుకుమార్ దంపతులను పూలమాల వేసి సత్కరించారు. పేర్ని మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో గత 32 సంవత్సరాలుగా పని చేస్తూ చల్లపల్లి, పెడన, మచిలీపట్నం మండలాల్లో కార్యదర్శిగా పని చేసి ఆయా గ్రామాల ప్రజల ఆదరాభిమానాలు పొందారన్నారు. తన బాల్య స్నేహితుడైన సుకుమార్ పేరుకు తగ్గట్టుగానే సౌమ్యంగా ఉంటూ అందరితో స్నేహం, ప్రేమానురాగాలతో మెలిగేవాడన్నారు. తన శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఒకటో డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి, సుకుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**నాగాయలంక:** ఈవోపీఆర్డీగా మండలంలో సేవలు అందించిన కలపటపు అప్పల నరసమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో సోమవారం ఘనంగా సన్మానించారు. నాగాయలంక, అవనిగడ్డ మండలాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ ఏఓ కె.ఎం.చంద్రశేఖర్ అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. నాగాయలంక సర్పంచి కైతేపల్లి అంకాలు, బంటుమిల్లి ఈవోపీఆర్డీ పి.శైలజాకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు అప్పల నరసమ్మ సేవలను కొనియాడారు. స్థానిక గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**పెడన:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ సోమవారం ఉద్యోగ విరమణ పొందిన పామర్తి వెంకటేశ్వరరావు దంపతులను పాలకవర్గ సభ్యులు, అధికారులు, బంధువులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. వెంకటేశ్వరరావును సన్మానించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మచిలీపట్నం కార్పొరేషన్ నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, పెడన పాలకవర్గ సభ్యులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. వీరందరికి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



సన్మానించిన పంచాయతీ కార్యదర్శులతో ఈఓపీఆర్డీ అప్పలనరసమ్మ



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ నాగకుమారి, మేయర్ వెంకటేశ్వరమ్మ, పాలకవర్గ సభ్యులు తదితరులు

**ఎంపీడీవో కార్యాలయంలో..**

ఏవో శిరీష ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రాజులపాటి వాణి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్జా వెంకటనగేష్, మాజీ ఎంపీపీ అచ్చుతరావు, వైఎస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, ఎంపీడీవో అరుణకుమారి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితరులు శిరీషను సన్మానించారు.

**ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన శివనాగమణి**

**గూడూరు:** మండలంలోని ఆకుమర్రు ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కాటూరి శివనాగమణి దంపతులను పాఠశాల విద్యాకుటుంబం సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించింది. ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం మాజీ సర్పంచి గోపి నాగబాబు, వరిగంజి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు మహేది, మహంకాళరావు, వాహబ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన బదిలీలలో పాఠశాల వీడి వెళ్లిన ముంగి రామాదేవి, తిరుమలశెట్టి దుర్గాప్రసాద్‌లను కూడా సత్కరించారు.

**మచిలీపట్నంఅర్బన్:** విద్యాశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ అభినందన సభ సోమవారం స్థానిక డీఈఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. డీఈఓ పీవీజే రామారావు, పలువురు నాగేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఏడీ పల్నాడు హుస్సేన్, టెక్ట్స్ బుక్స్ మేనేజర్ ఏఎస్కే ఆంజనేయులు, సీఐ విజయలక్ష్మి, ఎంఈఓలు, కార్యాలయ సూపరింటెండెంట్లు, ఎస్సీఆర్టీ ప్రొఫెసర్ డీవీ శ్రీమన్నారాయణ, డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు, అధ్యాపకులు లలిత్ మోహన్, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.